కథా నిలయం
331
శ్రీకాకుళం

# మీ ఓటు నాకే

మిసెస్ కైలాసం గారు ఆ నియోజక వర్గంలో నిల్చున్నదనగానే విజయం తథ్యం అన్నారు ఆ నియోజక వర్గంలోని ప్రజలు.

అంతవరకూ ఆమె ఎక్కడ కూర్చుందో ఆ నియోజక వర్గ ప్రజలకే కాదు, ఆమెగారికి టికెట్టు ఇచ్చిన ఆ పార్టీకే తెలియదు.

అంతవరకు మిసెస్ కైలాసం జి. ఓ. ( గజిటెడ్ ఆఫీసరు ) కుర్చీలో (రివాల్వింగ్ ఛైర్‌లో ) కూర్చుంది. జి. ఓ. నుంచి ఎన్. జి. ఓ. గా మారిన మిసెస్ కైలాసం, రివాల్వింగ్ ఛైర్ దిగి, సాదా చెక్క కుర్చీలో చస్తే కూర్చోనన్నది. తనంటి వ్యక్తిని చెక్క కుర్చీలో కూర్చోమని ఆర్డరు ఇచ్చిన ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసింది. పాలకులకు బుద్ధి లేదన్నది. అసలు ఈ దేశం

బాగుపడదని గంగవెర్రులెత్తి కేకలు వేసింది. చివరకు రాజీనామా ఇచ్చి, తనలాంటి మేధావి సర్వీసెస్‌ను పొందడం చేతగాని ప్రభుత్వాన్ని చూసి జాలిపడింది.

తనలాంటి వాళ్ళు పాలకవర్గంలో వుంటేగాని ఈ దేశం బాగువడదనే విశ్వాసం ఆమెకు కలిగింది. భర్త పోతూ పోతూ వదిలేసిన మూడు ఎకరాల మాగాణి పొలం చూసుకోవటానికి, ఏనాడో వదిలేసిన గ్రామం చేరింది. అనతికాలంలోనే మంచి వలుకుబడి సంపాదించుకుంది. ఆ నియోజక వర్గంలో టికెట్ సంపాదించుకుంది.

ఇంతకీ ఆమెగారి విజయం గురించి అభిజ్ఞవర్గాల వారంతా ఊహాగానం చేయడం ఆమెగారి పేరు బలమేకాక, ఆమెకు టికెట్ ఇచ్చిన సీదాపార్టీ సాదా రాజకీయాలే చాలవరకు కారణం కావచ్చు! కాని ఆమెగారికి మాత్రం తన గొప్పతనమే తనకు విజయాన్ని సాధించి పెడుతుందనే పూర్తి నమ్మకం వుంది. ఆ నియోజకవర్గ ప్రజలు అంత మూర్ఖులు కాదనీ, ఎవరికి ఓటివ్వాలో వాళ్ళకు బాగా తెలుసుననీ, తనలో తనే ఎన్నోసార్లు అనుకుంది.

అసలా పార్టీ మధ్యతరగతి ప్రజల్లో పుట్టినా కార్మిక, ధనిక వర్గాల అభ్యుదయమే తమ ఆశయమని బహిరంగంగా ప్రకటించుకున్నది. ఆ పార్టీ టికెట్ దొరగ్గానే, ఆ అభ్యర్థుల విజయం తథ్యమనేందుకు మరొక కిటుకు కూడా వుంది.

ఆ పార్టీవాళ్లు అతివాదుల్లో అతివాదులుగానూ, మితవాదుల్లో మితవాదులుగానూ వుంటూ వచ్చారు. కాని ఇప్పుడు దేశ పరిస్థితులదృష్ట్యా కానీయండి ఎలక్షన్స్ దృష్ట్యా కానీయండి, ఏ మ యి తే నేం గా ని, అతివాదుల్లో మితవాదులుగా, మితవాదుల్లో అతివాదులుగా మారిపోయారు. తామూ తమ పార్టీ సర్వనాశనమైనా వామపక్షాలతో చేతులు కలపబోమని, పార్టీ నాయకులు పదే పదే ఉద్ఘాటించి మితవాదుల మనస్సులను చూరగొన్నారు.

అందుకే తమ పార్టీ ఎన్నికల యుద్ధంలో దూకటం తోనే విజయలక్ష్మి పూలమాలతో ఎదురు వస్తుందనీ, కనీసం రెండు మూడు రాష్ట్రాల్లోనైనా మంత్రివర్గ నిర్మాణం జరుగుతుందనీ కలలు కన్నారు.

మిసెస్ కైలాసంగారు, మిసెస్ వైకుంఠం, మిసెస్ పరాంకుశం, శ్రీమతి శిఖండి, శ్రీమతి ముకుందం మొదలైన మహిళామణులతో, ఎన్నికల ప్రచారం ప్రారంభించగానే ఎదుటి పార్టీవాళ్ళ గొంతులు పక్షవాతం వచ్చినట్లు బిగుసుకు పోయాయి.

ఆమెగారికి రామలింగం, జంబులింగం ఇద్దరూ రెండు భుజాల్లా పనిచేశారు. రామలింగంగారి మంచితనము, జంబులింగంగారి కరుకుతనమూ ఆ నియోజక వర్గంలోని ఓటరు మహాశయులను తమవైపుకు ఆకర్షించుకోగలిగినై.

కూలీపేటల్లో బీదల పార్టీగానూ రైతు వీధుల్లో రైతు పార్టీగానూ, పెద్ద బజార్లో మధ్యతరగతి ప్రజల పార్టీగానూ చెలామణి అవుతున్న తమ పార్టీకి విజయం తథ్యమని, రామలింగం, జంబులింగం మిసెస్ కైలాసానికి నమ్మకం కలిగించారు. ఆ దెబ్బతో ఆమె తనకున్న ఆ మూడు ఎకరాల మాగాణి అమ్మేసింది.

తను తప్పక ఎం. ఎల్. ఏ. అవుతుంది. ఆ తర్వాత చిన్న మంత్రిణి కాలేకపోతుందా ? అప్పుడు ఇలాంటి ముష్టి మూడెకరాలు ఒక లెక్కా ! అలాంటి ఎకరాలు ఎన్నయినా సంపాదించుకోవచ్చు ! దస్తావేజుమీద సంతకం పెడుతూ అనుకుంది.

ప్రతి ఓటరు అవసరాల్నీ, ఉద్దేశాల్నీ పసిగట్టి వాగ్దానాలు చేస్తూ ప్రచారం సాగించారు మిసెస్ కైలాసం తాలూకు వారు.

బీదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలిప్పిస్తామనీ ఎన్. జి. ఓ. లు వుంటున్న ఇళ్లు హక్కు భుక్తం చేస్తామనీ ప్రచారం సాగించారు. మిసెస్ కైలాసంగారి గొప్పతనాన్ని గురించి చెబుతూ—ఆమె దేశంలో ప్రబలిపోతున్న అవినీతినీ, అన్యాయాన్నీ చూసి సహించలేక గెజిటెడ్ ఆఫీసరు ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి ఉరికిందనీ ఆమెలాంటి వ్యక్తిని ఎన్నుకోవడం ప్రజలు తమను తామే

గౌరవించుకున్నట్టనీ శ్రీమతి శిఖండి గంట వాయించినట్టు వేదికలమీద ఎక్కి అనర్గళంగా ఉపన్యాసాలు ఇస్తోంది.

ఒక బహిరంగసభలో మిసెస్ కైలాసం ఏమంటున్నారో వినండి — "మహాజనులారా! నన్ను గెలిపించి మిమ్మల్ని మీరే గౌరవించుకోండి! (జనంలో నవ్వులు) నవ్వకండి నేను చెప్పేదేమంటే మనదేశంలో.... మన ఈ భారతదేశంలో.... రెండే రెండు పార్టీలున్నాయి. మిగతావన్నీ చిల్లర పార్టీలు. దేశంలో ఎక్కడ చూసినా లంచగొండితనం పెరిగిపోయింది. కాగడా వేసి వెతికినా నీతి నిజాయితీ కన్పించడం లేదు. కార్మిక కర్షకులకు నిజమైన ప్రాతినిధ్యం వహించి, దేశంలో సోషలిజాన్ని స్థాపించగలిగేది నిజంగా మన పార్టీయే. కూలివాళ్ళ దగ్గర నుంచి జమీందార్ల దాకా మన పార్టీలో వున్నారు. అంటే కూలీలకు జమీందార్లమీద నమ్మకం రుజువు అయిందన్న మాట. అంటే మన పార్టీ కూలీలకూ జమీందార్లకూ మధ్య వైషమ్యం కాక, సామరస్యం కుదిరించగలిగింది." ఓ క్షణం ఆగింది.

వేదికమీద అధ్యక్షాసనంలో కూర్చునివున్న మిసెస్ వైకుంఠం చప్పట్లు కొట్టింది. సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయ్. మిసెస్ కైలాసం బొడ్లో దోపుకున్న కర్చీఫుతీసి ముఖం తుడుచుకొని ఓసారి గర్వంగా సభను

కలియచూసింది. ఆమెకు ఒత్తుల్లేని కొన్ని శబ్దాలకు ఒత్తులు పెట్టి పలకటం అలవాటు.

"ఈ మధ్య మన పార్టీకి ఎవరో మహారాజులూ, జమీంధార్లూ, విదేశీయులూ లక్షలిచ్చారని చిల్లర పార్టీల వాళ్ళు పుకార్లు లేవదీశారు. అవన్నీ ఒట్టి పుకార్లే. పోనియ్ ! ఒక్కవేళ ఇచ్చారే అనుకుందాం ?"

సభలో కలకలం 'వినండి! వినండి!' అనే కేకలు. మిసెస్ కైలాసం ఒకసారి దగ్గి, ఎదురుగా వున్న గ్లాసులోని నీరు సిప్‌చేసి సున్నితంగా పెదవులు కర్చీపుతో అద్దుకొని మళ్ళీ ప్రారంభించింది.

"ఇలా ఇచ్చారే అనుకుందాం. దీనినిబట్టి, మన పార్టీకి విదేశాల్లోనూ, జమీందార్లలోనూ వున్న పలుకుబడి స్పష్టంగా తెలుస్తుంది. మన పార్టీ అధికారంలోకి రాగానే తల వొక్కింటికి పదెకరాలు పంచి పెడుతుంది."

"మరి రెండు తలకాయలుంటే ?" ఎవరో లేచి ప్రశ్నించారు.

"రెండు పదులు ఇరవై." తడుముకోకుండా సభాధ్యక్షురాలు మిసెస్ వైకుంఠం కంఠం దేవుడి గుడిలోని గంటలా ఖంగ్‌న మ్రోగింది. మళ్ళీ సభలో కరతాళ ధ్వనులు !

"ప్రజాసేవ చెయ్యాలనే భావం నన్ను నిద్రపో నిచ్చింది కాదు. **అందుకే** గెజిటెడ్ ఉద్యోగం వదుల కొని, మీ మధ్యకు వచ్చి నిలబడ్డాను. మీరు కూడా కేవలం మాబ్, అదే మందలా ప్రవర్తించకుండా విచక్షణా జ్ఞానంతో ఓట్లువేసి నన్ను గెలిపించి, నాకు మీ అందరి సేవ చేసే అదృష్టాన్ని కలిగిస్తారని ఆశిస్తున్నాను." అంటూ మిసెస్ కైలాసం సభకు ఓ పెద్ద నమస్కారం పెట్టి కూర్చుంది.

ఈ విధంగా సభల్లోనూ, ఇళ్ళకు వెళ్ళీ తమ పార్టీ అధికారంలోకి రాగానే, తమ పార్టీ చెట్టునీడ క్రింద వున్న వాళ్ళందరికీ తలో మేడా కట్టించి ఇస్తామన్నారు. అందాకా తాము నిర్మించిన గాలిమేడల్లోనే వుండిపొమ్మన్నారు.

తాటస్థ్యంలో పాక్షికత్వాన్ని, పక్షపాతంలో తాటస్థ్యాన్ని, ఏకత్వంలో భిన్నత్వాన్ని ప్రజాస్వామ్యంలో నియంతృత్వాన్నీ, పెట్టుబడిదారీ వర్గ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యాన్నీ అయోమయంలో స్పష్టతనూ చూప గలిగింది తమ పార్టీ ఒక్కటే నన్నారు. అన్నింటికంటే వ్యక్తి స్వాతంత్ర్యానికి తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందట. తమ పార్టీలో ప్రతి సభ్యుడికి, నాయకుడికీ తన ఇష్టం వచ్చినట్టు మాట్లాడే స్వాతంత్ర్యం వుంటుందట.

ఎన్నికల తేదీ దగ్గిర పడుతున్నకొద్దీ ప్రచారం ముమ్మరంగా సాగిపోతూంది. శ్రీమతి శిఖండమ్మ వెళ్ళిన

చోటుల్లా మరో పార్టి వాళ్ళకు మంచినీళ్ళు కూడా పుట్టవనే నమ్మకం వుంది ఆ పార్టి వాళ్ళకు. ఆఖరి క్షణాల్లో రామలింగంగారు అమాంతం ఓటర్లను కావలించుకొని ఆవురుమన్నారు. తమ పార్టీనీ, అభ్యర్థినీ కాకపోయినా తనను చూసైనా ఓటు వెయ్యమని వేడుకున్నాడు. ప్రేమ లేకపోయినా జాలివల్లనైనా వెయ్యమన్నాడు. వేస్తానని వాగ్దానం చేసిందాకా పట్టుకున్న కాళ్ళు విడిస్తే వొట్టు.

ఆఖరి క్షణంలో భుజంగంగారికి ఆవేశం పెరిగి పోయింది. భూమ్మీద కాళ్ళానలేదు. ఎదటి పార్టీవాళ్ళను నోటికొచ్చిన బండబూతులూ తిట్టారు.

శ్రీమతి శిఖండమ్మ నాయకత్వాన పాతికమంది మహిళలదాకా ఇంటింటికి వెళ్ళి ఆడంగులకు పళ్ళూ పువ్వులూ, పసుపూ కుంకుమా ఇచ్చి ఓట్లు అడిగారు. ఆడవాళ్ళ ఓట్లన్నీ తమకే పడిపోతాయనే నమ్మకం కలిగింది. మిసెస్ కైలాసం "ఏం చేసినా ఆడవాళ్ళే చెయ్యాలి. వాళ్ళకున్న తెగింపు మొగవాళ్ళల్లో ఎక్కడుంది." అంటూ మురిసిపోయింది.

మహిళామణుల ప్రచార ధాటికి వోటర్ల తలలు ఊగిసలాడిపోయినై బాలెట్ పెట్టెలు నిండిపోయినై, మిసెస్ కైలాసానికి విజయం తథ్యం అన్నారు. కనీసం పదివేలన్నా మెజారిటీ వుంటుం దన్నారు లాబీ వర్గాలవారు.

ఆ రాత్రి అలసిపోయి మంచంమీద వాలిపోయిన మిసెస్ కైలాసానికి మనస్సు మాత్రం ఎంతో తేలిగ్గా ఆకాశంలో ఎగురుతున్నట్టనిపించింది. అలసటతో మూతలు పడ్డ కళ్ళల్లో అసెంబ్లీ హాలు కనిపించసాగింది.

తన గొప్పతనాన్ని గుడ్డి ప్రభుత్వం గుర్తించలేక పోయింది. కాని ప్రజలు గుడ్డివాళ్ళు కారు ! అందుకే వాళ్లు గుర్తించారు. ఒకసారి తను బడ్జెట్ సెషన్‌కు డైరెక్టర్‌తో వెళ్ళి గాలరీలో కూర్చుంది ! కిందకు చూస్తూ. ఒక బెంచీనుంచి మరో బెంచీకి వెళుతూ, వాళ్ళతో వీళ్ళతో కబుర్లు చెబుతూ తిరిగే ఆడ ఎం.ఎల్.ఏ. లు పైన కూర్చున్న తనకు మానస సరోవరంలో విహరించే హంసల్లా కన్పించారు. కొందరు బాతుల్లా నడుస్తున్నట్టనిపించింది. ఆనాడే తనకు అనిపించింది తను కూర్చోవలసింది గ్యాలరీలో కాదనీ, కింద హాలులోననీ. తన గొప్పతనాన్ని తను ఏనాడో గ్రహించింది. కాని ప్రజలే ఆలస్యంగా గుర్తించారు.

తన డైరెక్టరు తనను వింత మృగంలా చూసేవాడు. ఆ జానకి తలపొగరు అంతా ఇంతా కాదు. రేపు తను ఎం. ఎల్. ఏ. అవుతుంది. మినిష్టర్ కూడా అవుతుంది. సి. యం. ను అడిగి తను ప్రత్యేకంగా ఆ శాఖనే తనకు కేటాయించమని అడిగితే పోలా ? అప్పుడు చూపిస్తుంది తన తడాఖా. లేకపోతే తనకు రివర్షన్ ఇప్పించి ఎన్.జి.ఓ. ని

చేస్తాడూ ? టెస్టు పాసు కాలేదట తను. వెధవ టెస్టులు. అసలు తనలాంటి వాళ్ళకు ఎగ్జెంప్షన్ ఇప్పించాలి ఆ జానక్కి ప్రమోషన్ ఇచ్చి తన సీట్లో కూర్చో పెడతాడా ?

తను ఎం. ఎల్. ఏ. అయాక ఇంత సింపుల్‌గావుంటే లాభంలేదు. కొంచెం స్మార్టుగా వుండాలి. పట్టుచీరల్లో తను మరీ లావుగా పొట్టిగా కన్పిస్తుంది. సిల్కు చీరలు కావాలి. హైహీల్స్ వేసుకుంటే తను మరీ అంత పొట్టిగా కన్పించదు. అసెంబ్లీలో తను అలా అలా సరస్సులో బాతులా ఈదుతూ నడుస్తుంది. కలల్లోనుంచి నిద్రలోకి జారిపోయింది మిసెస్ కైలాసం.

ఏమైనా ఈ ఎన్నికల రద్దీలో మిసెస్ కైలాసానికి డబ్బు బాగానే కరిగింది. దాదాపు వున్నదంతా వదిలిపోయి నట్టే. కొంచెం బాధ కలిగినా....తీరా రంగంలో దిగాక డబ్బుకు వెనకా ముందూ చూసుకుంటే ఎలా ? అవార తను గెలిచాక సంపాదించుకోలేకపోతుందా ? మినిష్టరు కాకపోయినా హీన పక్షం డిప్యూటీ స్పీకర్ అయినా కాకపోతుందా ? అనుకుంటూ తృప్తిపడింది.

ఓట్లు లెక్కింపు ప్రారంభం అయింది. బయటకు వెళ్ళాలంటే పెద్ద చిక్కే వచ్చిపడింది. చీర మార్చుకుందా మంటే మారు చీర మంచిది లేదు. అన్నీ విడిచేసి వున్నై. పెట్టెలో ఒక్కటీ లేదు. ఎలక్షన్స్ రద్దీలో పూటకొక్కటి తొక్కేయడం జరిగింది. పట్టుచీరలన్నీ కారు దుమ్ములో

ధ్వంసం అయిన్నై. మహిళా ప్రచారకులంతా అందినంత వరకు కట్టిపారేశారు....దొరికినంతవరకు ఎత్తుకుపోయారు.

అప్పటికీ వాళ్ళకోసం ఎన్ని చీరలు కొన్నదీ? షాపుకారు కొట్లో అప్పుచేసి తీసుకొంది. వాళ్ళందర్నీ మేపడానికి కాబూలీవాలా దగ్గర అప్పుకూడా తీసుకుంది. ఎంత వెతికినా ఒక్కటీ మంచి చీర కన్పించలేదు. చిరాకు వేసింది మిసెస్ కైలాసానికి.

ఒక ప్రక్క వోట్ల లెక్కింపు జరిగిపోతుందేమో! ఈ ఒంటి చీరెతో ఎలా పోతుంది! తూ! పాడు! అంత దుమ్ముకొట్టుకొని నలిగిన చీరె కట్టుకొని ఎలా పోవడం? అందరూ తనను చూస్తూ "ఈమేనా? మిసెస్ కైలాసం, ఎం. ఎల్. ఏ.?" అంటే తనకే కాకుండా తన పార్టీకి ఎంత నామోషి? పోనియ్ కొత్తది కొందామంటే డబ్బులేదాయే! ఇప్పటికే చీరల బాపతు పద్దు చాలా పెద్దదే వుంది ఆ షాపులో.

మిసెస్ కైలాసం మెదడులోకి మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. సరాసరి బట్టలషాపులోకి వెళ్ళి రెండు సిల్క్ చీరలు కొన్నది. తొందర్లోనే తనకు డబ్బు వస్తుందనీ మొత్తం బాకీ ఒకేసారి తీరుస్తానని చెప్పింది. సంగతి అర్థంచేసుకున్న షాపుకారు కిక్కురుమనకుండా ఇచ్చాడు, పాత బాకీతోపాటు కొత్తది కూడా రాబట్టుకోవాలనే ఆశతో.

సాయంకాలానికే ఫలితాలు తెలిశాయ్. మిసెస్ కైలాసానికి డిపాజిట్ గల్లంతు అయింది. అంటే మరీ అంత

అన్యాయంగా రాలేదు! ఎలక్షన్ ముందు విత్‌డ్రా చేసుకున్న అభ్యర్థికంటే ఏడు వోట్లు ఎక్కువే వచ్చినై!"

ఆ వార్త విన్న మిసెస్ కైలాసానికి తల గిర్రున తిరిగి కైలాసంకేసి ఎగిరిపోతున్నట్టనిపించింది. ఏదో మైకం చుట్టేస్తోంది. కళ్ళముందు చిందర వందరగా నలిగి పడివున్న పట్టుచీరెల కుప్పా, పద్దు పుస్తకంలో బాకీలు బట్టలషాపు షావుకారు.... కాబూలీ.... వాలా.... గిర్రున రంగులరాట్నంలా తిరుగుతున్నారు ఒకరి తర్వాత ఒకరు ఆమె బుర్రలో.

భారతదేశంలో ఈసారి ఎన్నికల్లో మహిళల కిచ్చిన ప్రాతినిథ్యం "ప్రపంచ చరిత్రలో అపూర్వం" రేడియోలో విన్పిస్తోంది.

మిసెస్ కైలాసం ఒక్క ఊపున వెళ్ళి రేడియో గొంతు నొక్కేసింది.

"వెధవ ప్రజలు.... మాబ్.... మంద అదే గొర్రెల మంద.... ఎవరికి ఓటివ్వాలో తెలియని గొర్రెలమంద, ఈ మంద ఎప్పటికి మారుతుందో! ఈ దేశం ఎప్పటికి బాగుపడుతుందో!" పళ్ళు నూరబోయి నాలిక కరుచుకొని 'అబ్బా!' అన్నది మిసెస్ కైలాసం.

ఎం. ఎల్. ఏ. గా పోటీచేసి ఓడిపోయిన మిసెస్ కైలాసం ఏమయిందీ ఎక్కడుందీ తెలుసుకొని మరొకసారి చెబుతాను.

( యువ మాసపత్రిక 1979 )